సమాచారం

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.11, నల్ల వంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 55, పచ్చిమిర్చి 48, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 35, పందిరిబీర 40, క్యాబేజీ 10, క్యారెట్ 15, దొండ 35, గుండుబీన్స్ 31, గింజ చిక్కుడు 45, గోకరకాయ 40, కీర 37, దోసకాయ 23, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 28, చామగడ్డ 55, మొరంగడ్డ 28, కందగడ్డ 25, సొరకాయ 15, పొట్లకాయ 13, అరటికాయ 9 (ఒకటి), మునగకాయ 4–6, ముల్లంగి 3–5. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు ఉంటాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: గ్రీన్‌ల్యాండ్స్, కుందన్‌బాగ్, ఎయిర్‌పోర్ట్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ కిషోర్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జీఎంఆర్, ఫ్లైఓవర్ బేకరీ, స్టేటస్ ప్లాజా. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు టోపాజ్ బిల్డింగ్, నవదుర్గా జ్యువెలర్స్, ఏరియల్ టవర్స్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్, క్యాచె ప్రాపర్టీస్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

నేడు సీనియర్ సిటిజన్స్‌కు క్రీడా పోటీలు

సనత్‌నగర్: ఖైరతాబాద్ సర్కిల్–17 ఆసరా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పలు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ శాయి ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం వరకు క్యారమ్స్ (సింగిల్ అండ్ డబుల్స్), చెస్, జనరల్ నాలెడ్జ్ తదితర అంశాల్లో పోటీలు ఉంటాయన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

అడ్డగుట్ట: అడ్డగుట్ట డివిజన్‌లో మంజూరైన షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను నేడు (సోమవారం) డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ చేతుల మీదుగా అందజేస్తారని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. శాంతినగర్ వాటర్ ట్యాంక్ నుంచి ఆజాద్ చంద్రశేఖర్ నగర్ వరకు లబ్ధిదారుల ఇంటికెళ్లి పంపిణీ చేస్తారన్నారు.

క్లుప్తంగా

ఆహ్వానం

అమీర్‌పేట: సంత్ సేవాలాల్ మహారాజ్ జన్మస్థలమైన సేవా గాడ్‌లో జరిగే 284వ జయంతి ఉత్సవాలకు రావాలని సేవాలాల్ మహారాజ్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు కొర్ర జగన్నాథరావు ఆధ్వర్యంలో ఆదివారం ఎంపీ డా.లక్ష్మణ్‌ను కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. ఫిబ్రవరి 15న జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఎంపీని కలిసిన వారిలో రిటైర్డ్ డీజీపీ టి.కృష్ణప్రసాద్, చరణ్‌సింగ్, రవీందర్ నాయక్ ఉన్నారు.

యువకుడితో లాడ్జికి మైనర్

● నిర్వాహకులపై కార్పొరేటర్ ఫిర్యాదు

రాంగోపాల్‌పేట్: మైనర్ బాలిక ఓ యువకుడితో కలిసి లాడ్జికి రాగా గమనించిన బీజేపీ నాయకులు లాడ్జి నిర్వాహకులపై గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గోపాలపురం పోలీస్ స్టేషన్ వెనుక వైపున ఉన్న ఓ లాడ్జికి శనివారం మధ్యాహ్నం 21 ఏళ్ల యువకుడు, 16 ఏళ్ల బాలిక వచ్చారు. నిర్వాహకులు వారి ఐడీ ప్రూఫ్‌లు చూడకుండా రూ.800 తీసుకుని గదిని అద్దెకిచ్చారు. ఈ విషయమై బీజేపీ నాయకులు కార్పొరేటర్ కొంతం దీపిక దృష్టికి తీసుకెళ్లగా ఆమె పోలీసులకు సమాచారం ఇచ్చి లాడ్జి నిర్వాహకులను నిలదీసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అలరించిన కల్చరల్ ఫెస్ట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ దూరవిద్యా కేంద్రంలో నాచారంలోని హెచ్ఎంటీ సమీపంలోని పాటలర్ ఎన్ క్లే ఫౌండేషన్ స్కూల్ చిన్నారులకు ఆదివారం కల్చరల్ ఫెస్ట్–23 నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సైకాలజిస్ట్ డాక్టర్ కవిత, కరస్పాండెంట్ అండ్ ప్రిన్సిపల్ శాలిని పాల్గొని ప్రసంగించారు. ఆట పాటలు, ముద్దులొలికే మాటలతో చిన్నారులు అలరించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ టెక్నాలజీ పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. గ్లోబల్ అలుమ్నీ మీట్–2023లో భాగంగా ఆదివారం కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఓయూ వీసీ ప్రొ.రవీందర్ అధ్యక్షత వహించగా సీఎస్ఐఆర్, ఐఐసీటీ డైరెక్టర్ ప్రొ.శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి వెలిగించి అలుమ్నీ మీట్ ప్రారంభించారు. అనంతరం పూర్వవిద్యార్థుల విరాళంతో నిర్మించిన కెమికల్ ఇంజినీరింగ్ ల్యాబ్‌ను ప్రారంభించి మాట్లాడారు. డీఆర్‌డీఎల్ డైరెక్టర్ జీఏఎస్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, ప్రిన్సిపల్ ప్రొ.సాయిలు, అలుమ్నీ అధ్యక్ష కార్యదర్శులు ప్రొ.వెంకటేశ్వర్లు, ఎం. రాజమహేందర్‌రెడ్డి ప్రసంగించారు.

బస్తీ దవాఖానాలు..

● నత్తనడకన బస్తీ దవాఖానాల్లో 'టెలీ' సేవలు
● హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

మస్తుగున్నయ్!





వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

సనత్‌నగర్: నిన్న మొన్నటి వరకు చిన్న చిన్న అనారోగ్య సమస్యలకు వైద్య సేవలు అందించే బస్తీ దావాఖానాలు ఇప్పుడు స్పెషలైజేషన్‌లోనూ సేవలు అందిస్తూ ప్రైవేట్‌కు దీటుగా నిలుస్తున్నాయి. అయితే ప్రస్తుతం ఆ సేవలు టెలీ మెడిసిన్‌కే పరిమితం. వైద్య, ఆరోగ్య శాఖ 'ఈ–సంజీవని' యాప్ ద్వారా ఆయా విభాగాల్లో నిపుణులైన వైద్యులకు ఫోన్ ద్వారా సంప్రదించి రోగులకు సలహాలు, సూచనలు అందించే ప్రక్రియను గత కొన్ని నెలల క్రితమే ప్రారంభించింది. దీని ద్వారా రోగులు సత్ఫలితాలనే పొందుతున్నారు. అయితే కొన్ని సార్లు కాల్స్ కలవకపోవడం వల్ల ఇబ్బందులు కూడా తలెత్తుతున్నాయి. సనత్‌నగర్ అశోక్‌కాలనీ, అల్లావుద్దీన్‌కోఠి, బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్స్ తదితర బస్తీ దవాఖానాల్లో టెలీ మెడిసిన్ సేవలు కొనసాగుతున్నాయి.

స్పెషలిస్ట్‌లతో సలహాలు, సూచనలు..

ఆయా ఆస్పత్రులకు సగటున 70–80 మంది వరకు వస్తుండగా, అందులో 10–15 మంది వరకు స్పెషలిస్ట్ వైద్యుల సలహాలు, సూచనలను తీసుకుంటున్నారు. ఏదైనా స్పెషలిస్ట్‌ను సంప్రదించాలంటే ఇక్కడి వారు సుదూర ప్రాంతంలో ఉన్న గాంధీ ఆస్పత్రి లేదా ఉస్మానియాలకు వెళ్లాల్సిందే. లేదంటే వేలకు వేలు చెల్లించి ప్రైవేటు ఆస్పత్రుల బాట పట్టాల్సిందే. ఖర్చుతో కూడుకున్న పని కావడంతో తర్వాత చూద్దామంటూ వాయిదాలు వేసుకుంటూ చాలామంది తమ ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తూ వస్తుంటారు.

24 గంటల్లోపు వైద్య పరీక్షల ఫలితాలు..

వైద్య నిపుణుల సలహాలు తీసుకోవడం ద్వారా ఎలాంటి సమస్య ఉన్నా ముందస్తుగా అప్రమత్తమై వైద్య జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుంది. అలాగే ఎలాంటి ఆర్థిక భారం లేకుండా అన్ని రకాల వైద్య పరీక్షలు చెంతనే చేస్తున్నారు. తెలంగాణ డయాగ్నస్టిక్ ద్వారా 24 గంటల్లోపు వైద్య పరీక్షల ఫలితాలు కూడా వస్తుండటంతో సేవలు వేగవంతమవుతున్నాయి. మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల మధ్య టెలీ మెడిసిన్ సేవలు అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



అశోక్‌కాలనీ బస్తీ దవాఖానా

టెలీ మెడిసిన్ ద్వారా అందే సేవలివే..

వారం	స్పెషాలిటీస్
సోమవారం	డెర్మటాలజీ, గైనకాలజీ, మెడికల్ అంకాలజీ, నెఫ్రాలజీ
మంగళవారం	ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, ఎండోక్రైనాలజీ, డెర్మటాలజీ, నెఫ్రాలజీ
బుధవారం	జనరల్ మెడిసిన్, నెఫ్రాలజీ
గురువారం	పీడియాట్రిక్, జనరల్ సర్జన్, ఫిజియోథెరపీ, నెఫ్రాలజీ
శుక్రవారం	గైనకాలజీ, డెర్మటాలజీ, ఆర్థోపెడిక్స్, నెఫ్రాలజీ
శనివారం	ఆర్థోపెడిక్స్, ఫిజియోథెరపీ, నెఫ్రాలజీ

సద్వినియోగం చేసుకోవాలి..

బస్తీ దవాఖానాల్లోనూ అన్ని రకాల వైద్య సేవలందుతున్నాయి. ఒకప్పుడు చిన్న చిన్న వైద్యానికే పరిమితం కాగా, ఇప్పుడు టెలీ మెడిసిన్ సేవల ద్వారా ఎంతో మంది లబ్ధి పొందుతున్నారు. సామాన్య ప్రజలు సైతం ఎలాంటి ఖర్చు లేకుండా నాణ్యమైన వైద్య సేవలు పొందుతున్నారు. వైద్య పరీక్షల విషయంలోనూ ఎప్పటికప్పుడు ఫలితాలు రావడంతో కచ్చితమైన మందులు ఇవ్వడం ద్వారా త్వరితగతిన నయం అవుతుంది.

–డాక్టర్ సమీరాబేగం, అశోక్‌కాలనీ బస్తీ దవాఖానా వైద్యురాలు

సిరి సంపదలు వదిలి.. సాధువులుగా మారి!

ఘనంగా జైన కుటుంబం దీక్షా మహోత్సవ శోభాయాత్ర



రథయాత్రలో ప్రితేష్ సంఘ్వీ, తత్వ సంఘ్వీ



వీడ్కోలు పలుకుతున్న జైనులు

రాంగోపాల్‌పేట్: తరతరాలుగా కూర్చుని తిన్నా తరగని ఆస్తి.. భార్యా ఇద్దరు పిల్లలతో పచ్చని సంసారం. కానీ సంసార జీవితం, భౌతికమైన బంధాలు, అనుబంధాలు, కోరికలు అన్నీ వృథా అని భావించి ఓ జైన కుటుంబంలోని నలుగురు సాధువులుగా మారి సన్యాసత్వం తీసుకోబోతున్నారు. దీక్షా మహోత్సవం తీసుకోబోతున్న సందర్భంగా ఆదివారం ఆ కుటుంబ సభ్యులకు బంధువులు, స్నేహితులు, జైనులు కలిసి వీడ్కోలు సభను నిర్వహించారు. రాణిగంజ్‌లో హార్డ్‌వేర్ వ్యాపారం నిర్వహించే డీవీకాలనీకి చెందిన ప్రితేష్ సంఘ్వీ (45), భార్య రిపాల్ సంఘ్వీ (42), కుమారుడు తత్వ సంఘ్వీ(18), కుమార్తె హిర్వి సంఘ్వీ (10) మార్చి 9వ తేదీన అహ్మదాబాద్‌లో సన్యాసం స్వీకరించబోతున్నారు. ఆ కుటుంబం సన్యాసం స్వీకరించబోతున్న సందర్భంగా ఆయన సన్నిహితులు, కుటుంబ సభ్యులు అందరూ కలిసి ఆదివారం జనరల్‌బజార్‌లోని జైన మందిర్ నుంచి రాణిగంజ్, మినిస్టర్‌రోడ్, డీవీకాలనీ, పీజీరోడ్ మీదుగా హర్యానా భవన్ వరకు శోభాయాత్ర నిర్వహించారు. గుర్రపు బగ్గీలు, ఒంటెలు, రథాలపై చిన్నారులు కూర్చుని బ్యాండు మేళాలతో సందడిగా ఊరేగింపు కొనసాగించారు. సంఘ్వీ కుటుంబ సభ్యులు రథాలపై కూర్చుని తమ బట్టలు, డబ్బు కొన్ని వస్తువులు దారి వెంట చల్లుతూ సాగారు. అనంతరం హర్యానా భవన్‌లో వారికి వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో జైనులు కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్, బీజేపీ నాయకులు చీర శ్రీకాంత్ తదితరులు ఈ శోభాయాత్రలో పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించండి



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

రాంగోపాల్‌పేట్: రెజిమెంటల్‌బజార్‌లో వేధిస్తున్న మురుగు నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని మోండా మార్కెట్ కార్పొరేటర్ కొంతం దీపిక జలమండలి అధికారులకు సూచించారు. ఆదివారం ఆమె రెజిమెంటల్‌బజార్‌లోని వివిధ ప్రాంతాల్లో పర్యటించగా స్థానిక మహిళలు మురుగు నీటి సమస్యను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. డివిజన్‌లో ఈ పాటికే కొన్ని చోట్ల మురుగు నీటి, మంచి నీటి సమస్యల పరిష్కారానికి కొత్త పైప్‌లైన్ నిర్మాణాలు చేపట్టామని దశలవారీగా అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న టాయిలెట్ నిర్మాణ పనులను పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు.

కేలండర్ల ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఈటల

బౌద్ధనగర్: డివిజన్‌కు చెందిన టీఎంఎంఎస్ నాయకుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన కేలండర్‌ను ఆదివారం బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్, హరి, బల్లు, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

అడ్డగుట్ట డివిజన్‌లో..

అడ్డగుట్ట: అడ్డగుట్ట డివిజన్ ముదిరాజ్ మహాసభ నూతన సంవత్సర కేలండర్‌ను ఆదివారం సంఘం సభ్యులు నరేష్, సురేష్, గణేష్, శేఖర్, ఉదయ్ కాంత్ ఆవిష్కరించారు.

రసూల్‌పురాలో..

రసూల్‌పురా: రసూల్‌పురా రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం కేలండర్‌ను ఆదివారం కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సదా కేశవరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సంగారెడ్డి ఉపాధ్యక్షులు సంజీవరెడ్డి, సెక్రటరీ వెంకటరెడ్డి, జనరల్ సెక్రటరి నర్సింహా రెడ్డి, కోశాధికారి విష్ణురెడ్డి పాల్గొన్నారు.



సైకాలజిస్టుల్లో నైపుణ్యం పెంచేందుకు కృషి



మాట్లాడుతున్న డాక్టర్ మోతుకూరి రాంచందర్

రాంగోపాల్‌పేట్: సైకాలజిస్టుల్లో నైపుణ్యాలను పెంచి అత్యుత్తమ సైకాలజిస్టులుగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్ కృషి చేస్తుందని రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మోతుకూరి రాంచందర్ తెలిపారు. ఆదివారం ఎస్పీరోడ్‌లోని సూర్య టవర్స్‌లో జరిగిన వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో ఎక్కడో ఒక చోట వ్యసనాలకు బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పదార్థం, వస్తువును ఎక్కువగా ఉపయోగిస్తూ దాని ద్వారా శరీరానికి హానీ కలుగుతున్నా దాన్ని మానుకోలేక పోతున్నారని దాన్ని ఎంత ఉపయోగించాలో తెలియక ఎక్కువగా ఉపయోగిస్తూ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. మొబైల్, మద్యం, సిగరెట్, వీడియో గేమ్, అశ్లీల చిత్రాల వీక్షణ లాంటి వాటితో మానసిక, శారీరకంగా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇలాంటి చెడు వ్యసనాల నుంచి మెరుగైన చికిత్స విధానం కౌన్సెలింగ్ నైపుణ్యాలను వర్క్‌షాప్‌లో అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ రాజేశ్వరి లూథర్, డాక్టర్ ఎస్ రవీందర్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

కొనసా..గుతున్న షెడ్డు నిర్మాణం



లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో చేపట్టిన షెడ్డు నిర్మాణం ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్న చందంగా మారింది. ఈ ఆరోగ్య కేంద్రానికి నిత్యం వందలాది మంది రోగులు, బాలింతలు, గర్భిణులు, వ్యాక్సినేషన్, వైద్య సేవల నిమిత్తం వస్తుంటారు. వారి సౌకర్యార్థం నిర్మిస్తున్న షెడ్డు నిర్మాణం దాదాపుగా మూడు నెలల నుంచి నత్తనడకన కొనసాగుతుంది. దీంతో అక్కడికొచ్చే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. ఓపీ రిజిస్ట్రేషన్ గది నిర్మాణం సైతం గోడల వరకే నిలిచిపోయింది. ఉన్నతాధికారులు స్పందించి షెడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.

రూ.37 లక్షలతో సీసీ రోడ్డు పనులు



సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే సాయన్న

రసూల్‌పురా: గత ఆరు నెలల క్రితం నియోజకవర్గ అభివృద్ధి నిధులు వెచ్చించి రూ.17 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపట్టామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి. సాయన్న పేర్కొన్నారు. రసూల్‌పురా 105 గల్లీలో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. బస్తీలో రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండడంతో పట్టణ ప్రగతి అభివృద్ధి నిధులు రూ.20 లక్షల కేటాయించినట్లు చెప్పారు. మొత్తం రూ.37 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులు చేపట్టడం ద్వారా బస్తీలో ప్రధాన సమస్య పరిష్కారమైందని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్రియాసంఘ్ ప్రధాన కార్యదర్శి షేక్ నయిం, మార్కెట్ మాజీ చైర్మన్ శ్రీనివాస్, స్థానికులు కుమార్, ధన్‌రాజ్, నర్సింహా, శ్యాంరెడ్డి, భాస్కర్, చంద్రకాంత్, సురేష్ సాగర్, యాదగిరి, భిక్షపతి పాల్గొన్నారు.

◆ సీసీ రోడ్డు పనుల ప్రారంభోత్సవ కార్యక్రమం ముగించుకుని వెళ్తున్న ఎమ్మెల్యే సాయన్నను కలిసిన సిల్వర్ కాంపౌండ్ డబుల్ బెడ్రూమ్ నిర్వాసితులు మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కేవలం బోరు నీటిపైనే ఆధార పడాల్సి వస్తోందని 16 నెలలుగా మంచినీటి కోసం పక్క బస్తీలకు వెళ్లాల్సి వస్తుందని సాయన్న దృష్టికి తీసుకెళ్లగా మూడ్రోజుల్లో నీటి కనెక్షన్లు వచ్చేలా చేస్తానని సాయన్న హామీ ఇచ్చారు.

తెలంగాణ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



చెక్కులు అందజేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. నియోజకవర్గంలోని 46 మందికి మంజూరైన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఆదివారం ఆయన వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదింటి ఆడపడుచుల పెళ్లిళ్లకు ఆర్థిక సహాయం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన అనేక రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మహేశ్వరి, హేమలత, మాజీ కార్పొరేటర్లు ఎన్.శేషుకుమారి, అరుణగౌడ్, ఆకుల రూప, సికింద్రాబాద్ తహసీల్దార్ శైలజ పాల్గొన్నారు.


ఉచిత వైద్య శిబిరం అభినందనీయం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రతినిధులు

పద్మారావునగర్: ఉచిత వైద్య శిబిరాలు పేదలకు వైద్యపరంగా ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని పలువురు వక్తలు కొనియాడారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ బోలక్‌పూర్ క్రిష్ణానగర్‌లోని ఎవర్‌గ్రీన్ ఫ్రెండ్స్ అసోసియేషన్ కమ్యూనిటీహాల్లో ఆదివారం ఫస్ట్ సోర్స్ కార్పొరేట్ సహకారంతో నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన వచ్చినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పేదల సౌకర్యార్థం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సినీ దర్శకులు శేఖర్ కమ్ముల, ఫస్ట్ సోర్స్ వైస్ ప్రెసిడెంట్ ఆపరేషన్ హెడ్ అభినవ్ ప్రసాద్, కార్పొరేటర్ కె. హేమలత, బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ పవన్‌కుమార్ గౌడ్, ఎస్ఆర్‌డీ ప్రతినిధి శివరాణి, ఇందిరా భారతి, డాక్టర్ రాజేష్, అపర్ణ, ఉషాకర్ కీర్తి, అజయ్, మహేష్, రాకేష్ పాల్గొన్నారు.

3 కేంద్రాలు.. 2100 మంది అభ్యర్థులు



పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

ఉచిత శిక్షణ అర్హత పరీక్షకు పోటెత్తిన అభ్యర్థులు

రాంగోపాల్‌పేట్: పోలీస్ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ గ్రీన్ ల్యాండ్స్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ, హాస్టల్ వసతి కోసం అర్హత పరీక్షను నిర్వహించారు. ఆదివారం ప్యాట్నీ సెంటర్‌లోని ఎస్వీఐటీ ఆవరణలో నిర్వహించిన పరీక్షలో పెద్ద సంఖ్యలో అభ్యర్థులు పాల్గొన్నారు. ఎస్వీఐటీతో పాటు సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీ, వరంగల్‌లోని లాల్‌బహదూర్ కళాశాలల్లో కూడా ఈ అర్హత పరీక్ష నిర్వహించినట్లు నిర్వాహకులు, డీసీపీ మధుకర్ స్వామి తెలిపారు. మొత్తం 3 కేంద్రాల్లో 2100 మంది పరీక్ష రాశారని ప్రతిభ కనబర్చిన 200ని ఎంపిక చేసి 6 నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు.

బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయాలి



జెండాలను ఆవిష్కరిస్తున్న శ్రీలత శోభన్‌రెడ్డి

లాలాపేట: బీఆర్ఎస్‌ను బూత్‌స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి పిలుపునిచ్చారు. టీఆర్ఎస్, నుంచి బీఆర్ఎస్‌గా మారిన నేపథ్యంలో ఆదివారం బీఆర్ఎస్ జెండా పండగను నిర్వహించారు. తార్నాక చౌరస్తా, మాణికేశ్వర్‌నగర్, ఓయూ క్యాంప్ బస్తీలు, లాలాపేట ఇసుకబాయి, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో బైక్ ర్యాలీగా వెళ్లి పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసి బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆమె మాట్లాడారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రానున్న రోజుల్లో భారత్ రాష్ట్ర సమితి అధికారంలోకి రావడానికి కార్యకర్తలు, నాయకులు అంకితభావంతో పని చేయాల్సి ఉందన్నారు. త్వరలో నూతన బూత్ కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మోతే శోభన్‌రెడ్డి, బండెల స్వామి, గౌరమ్మ, అనీల్ సర్వదే, లక్ష్మీరెడ్డి, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.